www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్తపత్రిక
శనివారం
16-05-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 132
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 5

## జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

### వరి ధాన్యం నిల్వ ప్రక్రియ సక్రమంగా చేపట్టాలి
### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

తూప్రాన్ మే 15 సిరి న్యూస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు,గోదాములకు త్వరితగతిన తరలించాలని, ధాన్యం దెబ్బతినకుండా నిల్వ ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు



2




# కంపెనీ కనుసన్నల్లోనా నిష్పక్షపాతంగానా?!

### 'అరబిందో ఎపిటోరియా' ఆగడాలపై బోరపట్లలో జగిరిన సర్వే

- ఫలించిన 'సిరి న్యూస్' పోరాటం.. కదిలిన జిల్లా యంత్రాంగం
- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల జాయింట్ సర్వే పూర్తి
- న్యారేటికుంట, కంసాని కుంటల ఉనికికే ముప్పు..
- 17 ఎకరాల విస్తీర్ణాన్ని కబళించేందుకు కార్పొరేట్ కుట్రలు
- సహకార సంఘం భూమిలో అక్రమ కట్టడాలు..
- నిజాలు నిగ్గు తేలేనా? కంపెనీ అక్రమాలు బయటపెట్టేనా?
- అధికారుల అసలైన నివేదికపై సర్వత్రా ఉత్కంఠ

(ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్) : సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోర పట్ల గ్రామం ఇప్పుడు ఒక కార్పొరేట్ కంపెనీ ఆగడాలకు నిలయంగా మా రింది. అరబిందో గ్రూప్‌నకు చెందిన 'ఎపిటోరియా ఫార్మా' (యూనిట్-1) లాభార్జనే ధ్యేయంగా చట్టాలను చుట్టచుట్టుకుంటోంది. గత కొంతకాలంగా ఈ కంపెనీ సాగిస్తున్న భూ ఆక్రమణలు, కాలుష్య అరాచకాలపై 'సిరి దినపత్రిక' నిరంతరం కథనాలను ప్రచురిస్తూ అధికారుల నిద్రమత్తు వదిలించింది. ఫలితంగా శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్ మరియు సర్వే అధికారులు హుటాహుటిన క్షేత్రస్థాయిలోకి దిగి జాయింట్ సర్వే చేపట్టారు.

5



## కేసీఆర్ నమ్మిన బంటు
# 'తక్కెళ్లపల్లి'!

### పార్టీ పునర్నిర్మాణంలో రవీందర్ రావుది కీలక పాత్ర

- ఖమ్మం రీజినల్ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యత
- 1983 నుంచి రాజకీయాల్లో అపార అనుభవం
- 2007 నుండి కేసీఆర్ వెంటే అడుగులు.
- మీడియా డిబేట్లలో ప్రతిపక్షాలకు సింహస్వప్నం
- శాసనమండలిలో దూకుడు
- కాంగ్రెస్ వైఫల్యాలపై నిరంతర పోరాటం.
- సభ్యత్వ నమోదు ద్వారా క్యాడర్‌లో నూతనోత్సాహం
- ఉమ్మడి వరంగల్ నుంచి ఖమ్మం వరకు పార్టీ బలోపేతమే ధ్యేయం



తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం ఒక కీలకమైన దశలో ఉంది. అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని క్షేత్రస్థాయిలో తిరిగి పునర్నిర్మించడం, క్యాడర్‌లో మనోధైర్యాన్ని నింపడం అధినేత కేసీఆర్‌కు ప్రధాన సవాలుగా మారింది. ఇటువంటి క్లిష్ట సమయంలో, కేసీఆర్ తన నమ్మకస్తుడైన, అపార రాజకీయ అనుభవం గల నేత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావును ఒక బలమైన ఆయుధంగా రంగంలోకి దింపారు. పార్టీకి కష్టకాలం వచ్చిన ప్రతిసారీ తన వ్యూహచతురతతో గట్టెక్కించే రవీందర్ రావుకు, ఇప్పుడు అత్యంత కీలకమైన బాధ్యతలను అప్పగించారు.

(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్)

4

## ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తెలంగాణ

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు రావాలి : మంత్రి దామోదర్ రాజనర్సింహ
- కెజేఎస్ ఇండియా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్–II కు శంకుస్థాపనచేసిన మంత్రులు



3

# జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

### వరి ధాన్యం నిల్వ ప్రక్రియ సక్రమంగా చేపట్టాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**తూప్రాన్ మే 15 సిరి న్యూస్** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు,గోదాములకు త్వరితగతిన తరలించాలని, ధాన్యం దెబ్బతినకుండా నిల్వ ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని,శుక్ర వారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిం చారు తూప్రాన్ మండలం అల్లాపూర్ గ్రామంలోని నవ దుర్గా రైస్ మిల్లు ను కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రా ల ను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చెయ్యాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయం లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడ దని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధా న్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదా ములకు తరలించాలని, సంబంధిత రైస్ మిల్లర్లు, అధికారులు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒకరోజులో కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవా లని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంచుకోవా లని సూచించారు.

ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని రైస్ మిల్లుల యజమానులు ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్ డి ఓ జయ చంద్ర రెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య తూప్రాన్ తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి డిప్యూటీ తాసి ల్దార్ శ్రీకాంత్ ప్రేమ్ కుమార్ కొనుగోలు కేంద్రం నిర్వాహ కులు, మిల్లర్ల యజమానులు గ్రామ రైతులు తదిత రులు పాల్గొన్నారు,.



# ఆడపిల్ల పుట్టిందని ఫ్రీ డెలివరీ

### రామాయంపేట బాలాజీ నర్సింగ్ హోమ్ ఉదారత

మెదక్ , మే 14 (సిరి న్యూస్) సమాజంలో ఆడపిల్లల పట్ల ఉన్న వివక్షను పోగొట్టి, వారి జననాన్ని పండుగలా జరుపుకోవాలనే ఉద్దేశంతో రామాయంపేట పట్టణం లోని బాలాజీ నర్సింగ్ హోమ్ యాజమాన్యం ఒక గొప్ప నిర్ణయాన్ని అమలు చేస్తోంది. తమ ఆసుపత్రిలో ఆడపిల్ల పుడితే ఎలాంటి ఖర్చులు లేకుండా ఉచితంగా డెలివరీ చేస్తామన్న హామీని నిలబెట్టుకుంటూ, మహిళకు ఉచి తంగాశస్త్రచికిత్స నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన ఆవుల గీత అనే మహిళ ప్రసవం కోసం ఈనెల 11న రామాయంపేటలోని బాలాజీ నర్సింగ్ హోమ్‌లో చేరారు. ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ హేమరాజ్ సింగ్ నేతృత్వంలోని వైద్య బృందం ఆమెకు శస్త్రచికిత్స (సిజేరియన్) నిర్వహించగా, గీత ఆడపిల్లకు జన్మనిచ్చారు. ఆసుపత్రి యాజమాన్యం మాసుల రామరాజు ఇచ్చిన హామీ మేరకు, ఆడపిల్ల పుట్టినందుకు గానూ వైద్య ఖర్చులు, ఆపరేషన్ ఫీజు వంటివి ఏవీ తీసు కోకుండా పూర్తి ఉచితంగా చికిత్స అందించి మానవ త్వాన్ని చాటుకున్నారు.

### మంచి మార్పు కోసమే ఈ నిర్ణయం: ఎండి మాసుల రామరాజు

ఈ సందర్భంగా బాలాజీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మాసుల రామరాజు మాట్లాడుతూ.. "నేటి సమాజంలో ఆడపిల్ల పుడితే భారంగా భావించే పరిస్థి తులు ఇంకా అక్కడక్కడా కనిపిస్తున్నాయని, ఆ అపోహ లను పోగొట్టి, తల్లిదండ్రులు సంతోషంగా ఇంటికి వెళ్లాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మా ఆసుపత్రిలో ఎప్పుడైనా, ఎవరికైనా ఆడపిల్ల పుడితే.. అది నార్మల్ డెలివరీ అయినా లేదా ఆపరేషన్ అయినా సరే, రూపాయి తీసుకోకుండా ఉచితంగా వైద్యం అందిస్తాం" అని స్పష్టం చేశారు. ఆడపిల్లల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ బాలాజీ నర్సింగ్ హోమ్ చేస్తున్న ఈ కృషిని స్థానికులు, గీత కుటుంబ సభ్యులు అభినందిస్తు న్నారు.






# ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తెలంగాణ

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు రావాలి : మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**కెజేఎస్ ఇండియా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్–II కు శంకుస్థాపనచేసిన మంత్రులు**

**సంగారెడ్డి, మే 15 (సిరిన్యూస్):** తెలంగాణ రాష్ట్రాన్ని ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం ఆయన కొండాపూర్ మండలం తొగరపల్లిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తో కలిసి కేజేఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్-II కు శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేపడుతున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 1500 మందికి, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో భారీ స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌లు ఏర్పాటుకానున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 9 ట్రిలియన్ డాలర్ల మార్కెట్‌గా ఎదగనున్న నేపథ్యంలో తెలంగాణ కూడా ఈ రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. జహీరాబాద్ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని నిమ్జ్ (NIMZ) ను అతిపెద్ద పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం అంతర్జాతీయ పారిశ్రామిక కారిడార్‌గా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. 65 శాతం పైగా యువత నైపుణ్యాలను వినియోగించుకొని తెలంగాణను మరింత శక్తివంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతాలను గుర్తించి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు.తెలంగాణ దేశంలో అత్యధిక వరి ధాన్యం ఉత్పత్తి చేసే రాష్ట్రంగా నిలిచిందని, పాలు, పండ్లు, కూరగాయలు, పసుపు వంటి ఉత్పత్తులలో కూడా రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు విలువను పెంచే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటవడం రైతులకు, యువతకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా పటాన్‌చెరు గుర్తింపు పొందిందన్నారు. అదే తరహాలో వెనుకబడిన ప్రాంతాల్లో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో ఇంత పెద్ద స్థాయిలో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న కేజేఎస్ ఇండియా యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని పేర్కొన్నారు. మెదక్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి స్వర్గీయ ఇందిరా గాంధీ ఎంపీగా ఉన్న సమయంలో ఏర్పడిన పారిశ్రామిక ప్రోత్సాహక చర్యలే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, టి జి ఐ ఐ సి చైర్మన్లు నిర్మల జగ్గారెడ్డి, గిరిధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, టీజీఐఐసి ఎండి శశాంక్ , మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కంపెనీ చైర్మన్ గిరీష్ జైన్, ఎండి సి.పి.రాంకా, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






# సంగారెడ్డిలో టీజీఐఐసీ కార్యాలయం ప్రారంభోత్సవం!

**హాజరైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ**

**కొండాపూర్, మే 15(సిరి న్యూస్):** సంగారెడ్డి పట్టణంలోని ఆదర్శ్ నగర్ లో టీజీఐఐసీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యాలయంలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డిని నూతన కార్యాలయంలోని కుర్చీలో కూర్చోబెట్టారు. కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, టీజీఐఐసీ అధికారులు ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డికి అభినందనలు తెలిపారు.

# కేసీఆర్ నమ్మిన బంటు 'తక్కెళ్లపల్లి'!

**పార్టీ పునర్నిర్మాణంలో రవీందర్ రావుది కీలక పాత్ర**



- ఖమ్మం రీజినల్ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యత
- 1983 నుంచి రాజకీయాల్లో అపార అనుభవం
- 2007 నుండి కేసీఆర్ వెంటే అడుగులు.
- మీడియా డిబేట్లలో ప్రతిపక్షాలకు సింహస్వప్నం
- శాసనమండలిలో దూకుడు
- కాంగ్రెస్ వైఫల్యాలపై నిరంతర పోరాటం.
- సభ్యత్వ నమోదు ద్వారా క్యాడర్‌లో నూతనోత్సాహం
- ఉమ్మడి వరంగల్ నుంచి ఖమ్మం వరకు పార్టీ బలోపేతమే ధ్యేయం

**తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం ఒక కీలకమైన దశలో ఉంది. అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని క్షేత్రస్థాయిలో తిరిగి పునర్నిర్మించడం, క్యాడర్‌లో మనోధైర్యాన్ని నింపడం అధినేత కేసీఆర్‌కు ప్రధాన సవాలుగా మారింది. ఇటువంటి క్లిష్ట సమయంలో, కేసీఆర్ తన నమ్మకస్తుడైన, అపార రాజకీయ అనుభవం గల నేత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావును ఒక బలమైన ఆయుధంగా రంగంలోకి దింపారు. పార్టీకి కష్టకాలం వచ్చిన ప్రతిసారీ తన వ్యూహచతురతతో గట్టెక్కించే రవీందర్ రావుకు, ఇప్పుడు అత్యంత కీలకమైన బాధ్యతలను అప్పగించారు.**

(ప్రత్యేక ప్రతినిధి – సిరి న్యూస్)

### ఖమ్మం కోటలో రీజినల్ ఇన్‌ఛార్జ్‌గా..

ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'డిజిటల్ సభ్యత్వ నమోదు' కార్యక్రమానికి కేసీఆర్ తక్కెళ్లపల్లిని ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రీజినల్ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఖమ్మం జిల్లా రాజకీయాలు ఎప్పుడూ భిన్నంగా ఉంటాయి. అక్కడ పార్టీ క్యాడర్‌ను తిరిగి యాక్టివ్ చేయడం, చెల్లాచెదురైన నాయకులను సమన్వయం చేయడం ఒక సవాలుతో కూడుకున్న పని. ఇటువంటి 'ట్రబుల్ షూటర్' బాధ్యతను రవీందర్ రావుకు అప్పగించడం ద్వారా, కేసీఆర్ ఆ జిల్లాపై తన పట్టును నిరూపించుకోవాలని భావిస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ, డిజిటల్ సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తూ రవీందర్ రావు ఇప్పటికే అక్కడ పార్టీలో నూతనోత్సాహాన్ని నింపారు.

### రాజకీయ నేపథ్యం..

తక్కెళ్లపల్లి రవీందర్ రావు రాజకీయ ప్రయాణం నిన్న మొన్నటిది కాదు. 1983లో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయ అరంగేట్రం చేసిన ఆయన, క్షేత్రస్థాయి నుంచి ఎదిగిన నాయకుడు. 2007లో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న తరుణంలో కేసీఆర్ నాయకత్వానికి ఆకర్షితులై టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరారు. అప్పటి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పార్టీకి వెన్నుముకలా నిలిచారు. ఎన్నో ఉప ఎన్నికల్లో ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించి పార్టీ విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఆయనను, 2021లో కేసీఆర్ ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా గౌరవించారు.

### మీడియా వేదికలపై 'గులాబీ' గళం

పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీడియా పాత్ర అత్యంత కీలకం. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో, ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టడంలో రవీందర్ రావు శైలే వేరు. ప్రధాన మీడియా వేదికల్లో జరిగే చర్చా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ వాణిని ఆయన బలంగా వినిపిస్తున్నారు. సబ్జెక్ట్ మీద పట్టు, దూకుడైన ప్రసంగం ఆయన ప్రత్యేకత. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడంలోనూ, ప్రజా సమస్యల మీద నిలదీయడంలోనూ ఆయన వెనకడుగు వేయరు.
అసత్య ప్రచారాలను గట్టిగా కౌంటర్ చేస్తూ సోషల్ మీడియాలో కూడా ఆయన స్పీచ్‌లు వైరల్ అవుతున్నాయి.

### శాసనమండలిలో దూకుడు

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రవీందర్ రావు నిరంతరం పోరాడుతున్నారు. మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యం, రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరత వంటి అంశాలపై ఆయన శాసనమండలిలో గళం విప్పుతున్నారు. శాసనమండలి చర్చల్లో ఆయన మాట్లాడే శైలి, గణాంకాలతో సహా ప్రభుత్వాన్ని నిలదీసే తీరు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. కేవలం వరంగల్ కే పరిమితం కాకుండా, తెలంగాణ వ్యాప్తంగా పర్యటిస్తూ పార్టీ క్యాడర్‌కు అందుబాటులో ఉంటున్నారు.

### కేసీఆర్ 'నమ్మిన బంటు'

రాజకీయాల్లో పదవులు ఉన్నప్పుడు అందరూ ఉంటారు, కానీ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడే అసలైన నాయకత్వం బయటపడుతుంది. తక్కెళ్లపల్లి రవీందర్ రావు అటువంటి కోవకే చెందుతారు. కేసీఆర్ వ్యూహాలను అమలు చేయడంలో, పార్టీ పునర్నిర్మాణంలో ఆయన చూపిస్తున్న చొరవ అమోఘం. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీని మళ్ళీ పూర్వవైభవానికి తీసుకురావడంలో 'ట్రబుల్ షూటర్' రవీందర్ రావు పాత్ర మరింత కీలకం కాబోతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ సభ్యత్వ నమోదు లక్ష్యాలను చేరుకోవడమే కాకుండా, ప్రజా క్షేత్రంలో నిరంతరం పోరాడుతున్న రవీందర్ రావు, బీఆర్ఎస్ పార్టీకి ఒక అజేయమైన శక్తిగా నిలుస్తున్నారు.

BHARAT RASHTRA SAMITHI
భారత రాష్ట్ర సమితి








- ‘అరబిందో ఎపిటోరియా’ ఆగడాలపై బోరపట్లలో జగిరిన సర్వే
- ఫలించిన ‘సిరి న్యూస్’ పోరాటం.. కదిలిన జిల్లా యంత్రాంగం
- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల జాయింట్ సర్వే పూర్తి
- న్యారేటికుంట, కంసాని కుంటల ఉనికికే ముప్పు..
- 17 ఎకరాల విస్తీర్ణాన్ని కబళించేందుకు కార్పొరేట్ కుట్రలు
- సహకార సంఘం భూమిలో అక్రమ కట్టడాలు..
- నిజాలు నిగ్గు తేలేనా? కంపెనీ అక్రమాలు బయటపెట్టేనా?
- అధికారుల అసలైన నివేదికపై సర్వత్రా ఉత్కంఠ

# కంపెనీ కనుసన్నల్లోనా నిష్పక్షపాతంగానా?!

***(ప్రత్యేక ప్రతినిధి – సిరిన్యూస్): సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోరపట్ల గ్రామం ఇప్పుడు ఒక కార్పొరేట్ కంపెనీ ఆగడాలకు నిలయంగా మారింది. అరబిందో గ్రూప్ నకు చెందిన ‘ఎపిటోరియా ఫార్మా’ (యూనిట్-1) లాభార్జనే ధ్యేయంగా చట్టాలను చుట్టచుట్టుకుంటోంది. గత కొంతకాలంగా ఈ కంపెనీ సాగిస్తున్న భూ ఆక్రమణలు, కాలుష్య అరాచకాలపై ‘సిరి దినపత్రిక’ నిరంతరం కథనాలను ప్రచురిస్తూ అధికారుల నిద్రమత్తు వదిలించింది. ఫలితంగా శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్ మరియు సర్వే అధికారులు హుటాహుటిన క్షేత్రస్థాయిలోకి దిగి జాయింట్ సర్వే చేపట్టారు.***

### కుంటల ఆక్రమణ.. బఫర్ జోన్ లోనే కంపెనీ గేటు!

బోరపట్ల గ్రామ రైతులకు సాగునీటి ఆధారంగా ఉన్న న్యారేటికుంట (9 ఎకరాల 25 గుంటలు), కంసాని కుంట (7 ఎకరాల 25 గుంటలు) నేడు కబ్జాదారుల కోరల్లో చిక్కుకున్నాయి. కంపెనీ తన ప్రాంగణాన్ని విస్తరించే క్రమంలో కుంటల యొక్క ఎఫ్టీఎల్ పరిధిని ఏమాత్రం లెక్కచేయకుండా ప్రహరీ గోడను నిర్మించింది. కంపెనీ ప్రధాన గేటు సైతం బఫర్ జోన్ లోనే ఉందని గ్రామస్తులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఈ అక్రమాలను కప్పిపుచ్చేందుకు గతంలో అధికారులు తూతూమంత్రంగా సర్వేలు చేసి చేతులు దులుపుకున్నారు. అందుకే ఇప్పుడు పాత రికార్డులను పక్కన పెట్టి, శాస్త్రీయమైన ‘టిపాన్’ సర్వే చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.



### ప్రభుత్వ భూమిపై కార్పొరేట్ గర్వం!

సర్వే నంబర్ 379లో సుమారు రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి కేటాయించింది. రైతుల అవసరాల కోసం కేటాయించిన ఈ స్థలం చుట్టూ కోఆపరేటివ్ బ్యాంక్ రక్షణ గోడను కూడా నిర్మించింది. అయితే, ఏ చట్టం తమను ఏమీ చేయలేదన్న ధీమాతో అరబిందో యాజమాన్యం ఆ గోడను ధ్వంసం చేసింది. అంతటితో ఆగకుండా, ఆక్రమించుకున్న స్థలంలో 10 భారీ పిల్లర్లను వేసి భవన నిర్మాణాన్ని వేగవంతం చేసింది. ఒకపక్క సర్వే జరుగుతున్నా, పనులు ఆపకపోవడం అధికారుల వైఫల్యానికి నిదర్శనమని స్థానిక బీజేపీ నేత నాగప్రభు గౌడ్ మండిపడ్డారు.

### కాలుష్య నియంత్రణ అధికారుల డ్రామాలు!

భూమిని కబ్జా చేయడమే కాకుండా, భూగర్భ జలాలను విషతుల్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో ఎపిటోరియా చెలగాటమాడుతోంది. గతంలో పీసీబీ అధికారులు తనిఖీలకు వచ్చిన ప్రతిసారీ ఒక ప్రహసనంలా మారుతోంది. కంపెనీ వదులుతున్న వ్యర్థాలతో గ్రామాల్లోని బోరు నీరు పచ్చగా మారి దుర్వాసన వస్తుంటే, అధికారులు మాత్రం ఆ నీటిని పరీక్షించడం లేదు. కంపెనీ ప్రతినిధులు ముందే సిద్ధం చేసిన ఆర్వో వాటర్ క్యాన్లను శాంపిల్స్‌గా తీసుకెళ్లి ‘రిపోర్టులు బాగున్నాయి’ అని క్లీన్ చిట్ ఇస్తున్నారు. అధికారుల ఈ ‘ముడుపుల మత్తు’పై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నిష్పాక్షికంగా సర్వే నివేదిక ఇచ్చేనా?

కాగా, సర్వే రిపోర్ట్ పై గ్రామమంతా ఆశగా ఎదురుచూస్తోంది. అధికారులు కంపెనీ మేనేజ్‌మెంట్ ఇచ్చే ‘ఆతిథ్యానికి’ లొంగకుండా, వాస్తవాలను రికార్డు చేయాలని కోరుతున్నారు. ఒకవేళ అధికారుల నివేదికలు మళ్ళీ కంపెనీకి అనుకూలంగా ఉంటే, పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని, జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ఆస్తులను, ప్రాణాలను కాపాడాల్సిన అధికారులు కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తే, ఆ వ్యవస్థల బండారాన్ని బాధ్యతాయుతమైన పత్రికగా ‘సిరి న్యూస్’ ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉంటుంది.